సాక్షి పెద్దపల్లి

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



పాండవులగుట్టపై పూజలు

ధర్మారం కొత్తూరు పాండవులగుట్ట పంచ పాండవుల ఆలయంలో ముదిరాజ్ కులస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.



భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

పెద్దపల్లిరూరల్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థలు చేశారు.

గరిష్టం/కనిష్టం
29.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్య అందిద్దాం



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ బలోపేతం చేద్దామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి తన కార్యాలయంలో శుక్రవారం తొలిమెట్టు, ఉన్నతి విద్యార్థుల ఆరోగ్యం తదితర అంశాలపై సమీక్షించారు. విద్యా ప్రమాణాలను మెరుగు పర్చేందుకే తొలిమెట్టు, ఉన్నతి లక్ష్య కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతీ నెల మూడో శనివారం పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. డీఈవో మాధవి, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, కో ఆర్డినేటర్ షేక్ పాల్గొన్నారు.

మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అక్టోబర్ 1న మంత్రి కేటీఆర్ పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల్లో పర్యటిస్తారని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈమేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్డీవో మధుమోహన్, ఏసీపీ మహేశ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ సందర్శన



ప్లాంట్ వద్ద మంత్రి పురుషోత్తం రూపాల

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం రిజర్వాయర్‌లోని ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను కేంద్ర ఫిషరీస్, ఆనిమల్ హస్బండరీ, డెయిరీ శాఖ మంత్రి పురుషోత్తం రూపాల శుక్రవారం సందర్శించారు. రిజర్వాయర్‌లో నిర్మించిన దేశంలో అతిపెద్ద 100 మెగావాట్ల సామర్థ్యంగల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ సమాచారం గురించి అధికారులు ఆయనకు వివరించారు. ప్రస్తుతం ఉన్న 100 మెగావాట్ల ప్లాంట్‌తోపాటు మరో 56 మెగావాట్ల సామర్థ్యంగల ప్లాంట్ నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించినట్లు మంత్రి తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, ఎన్టీపీసీ కార్మిక సంఘ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి రాంచందర్, నాయకుడు సత్యనారాయణరెడ్డి, జనరల్ మేనేజర్ అనిల్ కుమార్ వేముల, అధికారులు పాల్గొన్నారు.

3 వరకు రైళ్ల రద్దు

రామగుండం: కాజీపేట – బల్లార్షా, కరీంనగర్ – బల్లార్షా మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను మరికొన్నిరోజులు రద్దు చేశారు. ఈమేరకు అక్టోబర్ మూడోతేదీ వరకు ప్యాసింజర్ రైళ్లు నడిపించడం లేదని దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఇదే విషయంపై రామగుండం రైల్వేస్టేషన్ నోటీస్ బోర్డులో ప్రకటన పత్రం అంటించారు. రామగిరి డెమూ ఇరువైపులా, కరీంనగర్ డెమూ ఇరువైపులా, సింగరేణి ప్యాసింజర్ ఇరువైపులా, బల్లార్షా – కాజీపేట మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను ఇరువైపులా రద్దు చేశామని పేర్కొన్నారు.


మోతాదు మించితే అనర్థమే

కమాన్‌పూర్: వరికి మోతాదుకు మించి యూరియా వేస్తే దిగుబడిపై తీవ్రప్రభావం చూపుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. కమాన్‌పూర్ క్లస్టర్ పరిధిలో పంటల నమోదు ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. వరి ప్రస్తుతం పొట్టదశలో ఉందన్నారు. అయితే, మ్యూరేట్ ఆఫ్ పొటాష్, లిక్విడ్, నానో యూరియా ఇప్పుడు పంటకు వేయాలని సూచించారు. అనంతరం ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఏవో ప్రమోద్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, సురేశ్‌నాయక్ ఉన్నారు.

నేటినుంచి నాటిక ప్రదర్శన

పెద్దపల్లిరూరల్: శని, ఆదివారాల్లో 'సంఘం శరణం గచ్ఛామి' నాటిక ప్రదర్శన ఉంటుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నాగలేశ్వర్ తెలిపారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా నాటిక రూపొందించారని పేర్కొన్నారు. ధర్మారం, పెద్దపల్లి, మంథని మండలాల్లో ప్రదర్శన ఉంటుందన్నారు. శనివారం పెద్దపల్లి జెండా చౌరస్తాలోని అమర్చంద్ కల్యాణ మండపం, అక్టోబర్ 1న మంథని పోచమ్మవాడలో నాటిక ప్రదర్శిస్తారని ఆయన వివరించారు.

ఆకట్టుకునే కచ్చురం



అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మానవ మనుగడ ప్రత్యేకత సంతరించుకుంటోంది. కానీ, సంస్కృతి, సంప్రదాయాలను విస్మరిస్తోంది. వీటన్నింటినీ పరిరక్షించడమే కాదు.. మానవ జీవనశైలి, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లో ఫొటోగ్యాలరీ ఏర్పాటు చేశారు. శుక్రవారం వాటిని పరిశీలిస్తూ ఇలా కనిపించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పరిరక్షించకుంటే.. పరులపాలే

- 'రంగనాయకుల స్వామి' భూములు అన్యాక్రాంతం
- పట్టాలు చేసుకున్న అక్రమార్కులు
- దీప, ధూపాలకు నోచుకోని స్వామివారు
- పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు
- మసకబారుతున్న 150 ఏళ్ల ఆలయ ప్రభ



పెద్దపల్లి మండలం ముత్తారంలోని రంగనాయకులస్వామి ఆలయం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కష్టమొస్తే దేవుడికి మొక్కుకుంటాం. కానీ, ఆ దేవుడికే కష్టమొచ్చింది. తన భూములు పరులపాలవుతుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి పెద్దపల్లి జిల్లాలోని రంగనాయకుల స్వామివారికి ఎదురవుతోంది. ఆలయ భూముల పరిరక్షణలో అధికార యంత్రాంగం ఉదాసీనత.. చట్టాల్లో లొసుగులు అక్రమార్కులకు వరంగా మారాయి. ఫలితంగా 150 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆలయ ప్రభ భూ ఆక్రమణల కారణంగా మసకబారుతోంది. ఇప్పటికే వందల ఎకరాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లినా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దేవాదాయశాఖలో భూ రికార్డుల నిర్వహణ ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో ఆయా భూములను ఇతరులు సాగు చేసుకుంటున్నారు. అందులో రాజకీయ పలుకుబడి ఉన్న నేతలు పట్టా పాసుపుస్తకాలు పొంది, రైతుబంధు సైతం తీసుకుంటున్నారు. దీంతో ఆయా భూముల పరిరక్షణ కోసం హైందవ సంస్థలు పోరాడుతున్నాయి. సిబ్బంది కొరతకు తోడు రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయ లోపం కూడా సమస్యకు కారణమవుతోంది.

85 ఆలయాల పరిధిలో 1,089 ఎకరాలు

పెద్దపల్లి జిల్లాలోని 85 ఆలయాల పరిధిలో 1,089.34 ఎకరాలుండగా, వీటిలో దాదాపు 20 శాతం భూములు ఆక్రమణలో ఉన్నట్లు సమాచారం. దేవాదాయ భూములకు సంబంధించి ఎక్కడికక్కడ హెచ్చరికలతో కూడిన బోర్డులు లేకపోవడంతోపాటు వందల సంవత్సరాల కిందటి భూములవడంతో కాలక్రమేణా వాటి ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

462.33 ఎకరాలు అన్యాక్రాంతం

పెద్దపల్లి మండలంలోని పాలితం, బొంపల్లి, కనగర్తి, కాసులపల్లి, ధర్మాబాద్ గ్రామాల్లో 462.33 ఎకరాల రంగనాయకుల స్వామి భూములున్నాయి. 1950కు ముందు అవి దేవుని భూములుగా రికార్డుల్లో నమోదయ్యాయి. సదరు భూముల్లో రైతుల పేర్లు తొలగించి, శ్రీ రంగనాయకుల స్వామి ఇనాం పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్స్ జారీ చేయాలని, 1బీ రిజిస్టర్‌లో కూడా నమోదు చేయాలని లేఖ నంబర్ బీ2/3715/2013 ద్వారా 26-11-2013న అప్పటి ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆలయ భూములను కొందరు తమ పేరిట మార్చుకోవడంపై అప్పటి ప్రభుత్వం సీరియస్ అయింది. ఏయే సర్వే నంబర్లలో ఎవరెవరు అక్రమమార్గంలో ఎంత భూమిని అనుభవిస్తున్నారో అప్పటి అధికారులు జాబితా రూపొందించారు. వెంటనే వారి పేర్లు తొలగించి, శ్రీ రంగనాయకుల స్వామి ఆలయం పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్స్ ఇవ్వాలన్న అప్పటి సర్కారు ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. కొందరు రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఆ భూముల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. దీనిపై అధికారులు అప్పట్లోనే నివేదిక సమర్పించారు.

సాక్షి పరిశోధన

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేదు

ఆలయాల భూముల లెక్క తేల్చడానికి దేవాదాయ శాఖ గతంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. దేవుడి పేరిట భూములను దానం చేస్తే వాటి వివరాలను 43 రిజిస్టర్‌లో నమోదు చేసింది. వాటిలో ఎంతమేర భూమి కబ్జా అయ్యింది? ఎవరి అధీనంలో ఉంది? ఇనాం, కౌలుదారులున్నారా? తదితర అంశాలపై సమాచారం సేకరించింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖల మధ్య సమన్వయలోపంతో భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా ఆస్తులు ఉన్నా ఆదాయం లేక ఆలయాలు నిర్వహణ అగమ్య గోచరంగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయాల భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కష్టాల్లో కమలం!

- బీజేపీని వీడే యోచనలో సోమారపు?
- చర్చనీయాంశమైన పార్టీ మార్పు!
- కాషాయం శ్రేణుల్లో నిస్తేజం



సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. రాజకీయ పార్టీల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలు దూకుడు పెంచాయి. ప్రజాసమస్యలపై పోరుబాట సాగిస్తున్నాయి. చేరికలతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల జోష్ పెంచుతుండగా.. బీజేపీ క్యాడర్ డీలాపడుతోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను మార్చిన తర్వాత కాషాయం పార్టీ శ్రేణుల్లో జోష్ తగ్గిందనే ప్రచారం ఉంది. జాతీయ పార్టీ పరిస్థితి ఇలా దిగజారడంతో ద్వితీయ శ్రేణి నాయకత్వం జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి కరీంనగర్‌లో గెలిచే అవకాశాలు ఉన్నస్థానాల్లో రామగుండం ఒకటని ఆశించిన అధిష్టానానికి షాక్ ఇస్తూ ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం కావడంతో బీజేపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సోమారపు దారెటు..?

- రాజకీయాల్లో ఆరితేరిన సీనియర్ నేత సోమారపు సత్యనారాయణ పార్టీ మార్పు నిర్ణయం రామగుండం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.
- ఎఫ్‌సీఐలో ఇంజినీర్‌గా పనిచేసిన సోమారపు.. తొలుత కాంగ్రెస్ తరఫున మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్‌గా విజయం సాధించారు.
- తర్వాత టీడీపీ తరఫున మంథనిలో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు.
- 2009లో రామగుండం అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్‌లో చేరారు.
- ఆ తర్వాత టీఆర్‌ఎస్‌లో చేరి 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు.
- 2018లో ఓటమి అనంతరం బీజేపీ కండువా కప్పుకున్నారు.
- బీజేపీలో అంతర్గత కలహాలతో జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సోమారపు.. తాజాగా పార్టీ మారుతారనే ఊహాగానాలు కమలం పార్టీలో గుబులు పుట్టిస్తున్నాయి.
- టికెట్ ఖరారు చేస్తే కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు కూడా ఆయన ఆసక్తి చూపుతున్నారని, కానీ, అనుచరులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ)సింహం గుర్తుపై పోటీచేయాలని ఒత్తిడి తెస్తున్నారని సమాచారం.
- మరోవైపు.. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విజయానికి సహకరిస్తే నామినేటెడ్ పోస్టు ఇస్తామని కారు పార్టీ నుంచి ఆఫర్ వచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.
- దీంతో సోమారపు సత్యనారాయణ ఏ పార్టీలో చేరుతారు? బీజేపీ నుంచే బరిలో నిలుస్తారా? అనే అంశం సర్వత్రా ఆసక్తిగా మారింది.
- ఇప్పటికే బీజేపీ సీనియర్ నేత కౌశిక్‌హరి పార్టీ వీడి ఆదివారం మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు.
- మరోపక్క పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి సైతం పార్టీ మార్పుపై జిల్లాలో జోరుగా చర్చలు నడుస్తున్నాయి.
- ఇలా పార్టీని ఒక్కొక్కరు వీడేందుకు సిద్ధమతుండటంతో భారతీయ జనతా పార్టీ క్యాడర్‌లో నిస్తేజం నెలకొంది.

ఎన్నికల వేళ కానరాని సందడి..

తెలంగాణలో అధికారమే లక్ష్యమని చెబుతున్న కమలనాథులు.. కార్యక్షేత్రంలో ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోతున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రేపో,మాపో అన్నట్లు ఉండటంతో అన్ని పార్టీల్లో ఎన్నికల సందడి జోరందుకుంది. బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటనతో రామగుండంలో కోరుకంటి చందర్, మంథనిలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పాదయాత్ర చేస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి విజయరమణరావు, మక్కాన్‌సింగ్, బీఎస్పీ నుంచి దాసరి ఉష వివిధ కార్యక్రమాలతో ఇప్పటికే ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. 'అన్ని పార్టీలది ఒకదారి.. మా పార్టీది మారోదారి' అన్నట్లు బీజేపీ మూడు నియోజకవర్గాల్లో ఏఒక్కచోట కూడా ఇప్పటికీ ఎన్నికల క్షేత్రంలో దిగలేదు. సోమారపు పార్టీవీడే యోచనలో ఉండగా, మంథని బీజేపీ అభ్యర్థి సునీల్‌రెడ్డి, పెద్దపల్లి బీజేపీలో గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, సురేశ్‌రెడ్డి ఎవరికి వారే అన్నట్లుగా మొక్కుబడి కార్యక్రమాల నిర్వహణకే పరిమితమవుతున్నారని కార్యకర్తలు వాపోతున్నారు. దీంతో శ్రేణుల్లో పార్టీ భవితవ్యంపై టెన్షన్ మొదలైంది.

గుర్తింపుపై డివిజన్ బెంచ్‌కు సింగరేణి

- న్యాయనిపుణులతో చర్చిస్తున్న ఉన్నతాధికారులు
- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ అనుమానమే?



గోదావరిఖని: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చేనెల 7న నామినేషన్లు స్వీకరించేందుకు డిప్యూటీ సీఎల్‌సీ సిద్ధమవుతుండగా రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. వచ్చేనెల మొదటివారంలో కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రానికి రాబోతోంది. అసెంబ్లీ ఎన్నికలపై పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో భేటీకానుంది. సమావేశం అనంతరం ఢిల్లీ వెళ్లిన వెంటనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

అనుకూల సంఘాలను అస్త్రంగా..

కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు సింగరేణి అన్ని యూనియన్లకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 14 సంఘాలను యాజమాన్యం అధికారికంగా పిలుస్తోంది. ఇదేక్రమంలో ఇప్పటికే 12రిజిస్టర్డ్ సంఘాలు కోడ్ ఆఫ్ డిసిప్లేన్ మార్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని రాతపూర్వంగా కోరాయి. దీంతో తమకు అనుకూలంగా ఉన్న సంఘాలను అస్త్రంగా మార్చుకుని ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ డివిజన్ బెంచ్‌కు వెళ్లే యోచనలో సింగరేణి యాజమాన్యం ఉంది. దీనికి సంబంధించి అధికారులు ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే డివిజన్ బెంచ్‌లో జాప్యం జరిగితే ఈలోగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి సింగరేణి గుర్తింపు ఎన్నికలు వాయిదాపడే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- మంత్రి కొప్పుల ఈశ్వర్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

గోదావరిఖని: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక సింగరేణి స్టేడియంలో మంత్రి కేటీఆర్ హాజరయ్యే సభాస్థలిని ఎమ్మెల్యే చందర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంతర్గాం మండలం రాయదండిలో కుర్షికమ్మి భూపట్టాల కోసం సీఎం కేసీఆర్‌ను పలుమార్లు కలిసి విన్నవించామన్నారు. దీంతోనే నాలుగు దశాబ్దాల సమస్యకు మోక్షం లభించిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎగరబోయేది గులాబీ జెండా అని అన్నారు. ఈసందర్భంగా క్యాంపు కార్యాలయంలో పెద్దంపేట ఎంపీటీసీ శరణ్య ఆధ్వర్యంలో సర్పంచ్ మెరుగు భాగ్యమ్మ, ఉపసర్పంచ్ కోడిపుంజుల భూమేశ్, వార్డు సభ్యులు పొన్నగంటి వనిత, తులా రాజనర్సు, పల్లెర్ల లక్ష్మి, కోమల, ఆడెపు మల్లేశ్వరి, 12వ డివిజన్‌కు చెందినవారు బీఆర్‌ఎస్ చేరారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నగరమేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ పెంట రాజేశ్, నాయకుడు నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. వానాకాలం ధాన్యం సేకరణ, మద్దతు ధర కల్పన తదితర అంశాలపై అధికారులతో తన కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రేమ్‌కుమార్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, సహకార అధికారి మైఖేల్‌బోస్ పాల్గొన్నారు.

సర్కార్ స్కూళ్లకు సన్నబియ్యం పంపండి

సర్కార్ బడుల్లో మధ్యాహ్న భోజనం కోసం నాణ్యమైన సన్నరకం బియ్యం సరఫరా చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనం అమలుపై ఆయన సమీక్షించారు. గోదాముల నుంచి నేరుగా పాఠశాలలకు సన్న బియ్యం రవాణా చేయాలన్నారు. డీఈవో మాధవి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్, అధికారి ప్రేమ్‌కుమార్, మండల విద్యాధికారులు, మండల స్థాయి గోదాముల అధికారులు పాల్గొన్నారు.

వెదురు మొక్కలు నాటాలి

- ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ సీపీ వినోద్‌కుమార్
- అటవీశాఖ ఉద్యానవనం సందర్శన



మొక్క నాటుతున్నచీఫ్ కన్జర్వేటర్ వినోద్‌కుమార్

రామగుండం: వాగులు, చెక్‌డ్యామ్‌లు, జలవనరులు ఉన్నచోట వెదురు మొక్కలు విరివిగా నాటాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ఐఎఫ్‌ఎస్ సీపీ వినోద్ కుమార్ సూచించారు. అంతర్గాం మండలం కుందనపల్లి అటవీ ప్రాంతాలను శుక్రవారం ఆయన జిల్లా అటవీశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. సెమీ మెకానికల్ మెథడ్ ప్లాంటేషన్ పరిశీలించారు. సీసీఎఫ్ చేతుల మీదుగా మొక్క నాటారు. ఉపాధిహామీ ద్వారా చేపట్టిన గుట్టభూముల్లో వర్షపు నీటిని సంరక్షించే కందకాల తవ్వకాల ప్రక్రియపై ఆరా తీశారు. ఇరువైపులా ఔషధ మొక్కలు నాటారు. రహదారి మధ్య చెక్‌డ్యాంలు పరిశీలించారు. వాగుల ప్రాంతాల్లో వెదురు మొక్కలు త్వరగా ఎదుగుతాయని తెలిపారు. అనంతరం ప్రముఖ స్వయంభూ శ్రీబుగ్గరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. శివుడిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో అటవీశాఖ భూముల పరిరక్షణ, పర్యవేక్షణపై అధికారులకు సూచనలు, సలహాలిచ్చారు. సీసీఎఫ్‌తో జిల్లా అటవీశాఖ అధికారి సీహెచ్ శివయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు నాగయ్య, సయ్యద్ రహ్మతుల్లా, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు పి.దేవదాసు, మిర్జా ఈర్షద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యం

- సీఎం కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శం
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



క్షీరాభిషేకంలో ఆర్పీలు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎలాంటి పథకాలు చేపట్టలేదని, దీంతో వారు వంటింటికే పరిమితమయ్యారని తెలిపారు. ప్రస్తుతం కుటుంబ పోషణలో వారుకూడా భాగస్వాములవుతున్నారని, ఇందుకు సీఎం కేసీఆర్ కృషి కారణమని పేర్కొన్నారు. ఆర్పీలను గుర్తించి, గౌరవం ఇచ్చిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఆర్పీల జీవన విధానం మెరుగుపడిందని అన్నారు. నియోజకవర్గంలోని మహిళల సాధికారత కోసం విజయమ్మ ఫౌండేషన్ ఏర్పాటు చేసి.. ఉచితంగా ఉపాధి శిక్షణ అందిస్తున్నామని చందర్ చెప్పారు. గత ఎన్నికల్లో ఆర్పీలు అందరూ తనకు వెన్నుదన్నుగా నిలిచి, గెలుపులో భాగస్వాములు అయ్యారని ఎమ్మెల్యే కోరుకంటి గుర్తుచేశారు. అక్టోబర్ ఒకటో తేదీన స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న రామగుండం దశాబ్ది ప్రగతి సభకు మహిళలు భారీసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ బాలరాజ్ కుమార్, నాయకులు పీటీ స్వామి, నారాయణదాసు మారుతి, పిల్లి రమేశ్, రజని, శారద, స్వర్ణ, స్వప్న, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో హయ్యర్, లోయర్ గ్రేడ్ల ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపునకు శుక్రవారం ఆర్‌సీవోఏ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు, డిప్యూటీ పర్సనల్ అధికారి నరేస్ చక్రవర్తి ఉన్నారు.

ఏఐటీయూసీపై విమర్శలు మానుకోవాలి

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న కార్మిక సంఘాల అభిప్రాయం మేరకే షెడ్యూల్ విడుదలైందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అన్నారు. హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ ఏఐటీయూసీపై చేస్తున్న విమర్శలు మానుకోవాలని సూచించారు. శుక్రవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో వారు మాట్లాడారు.




పల్లె నుంచి ఢిల్లీకి

- మనసు కవి నలిమెల భాస్కర్
- నాటకాలతో మొదలైన ప్రస్థానం
- పుస్తకాలతో కొనసాగుతున్న బంధం
- 14 భాషల్లో పుస్తకాల అనువాదం
- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో గౌరవం
- తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర

సాక్షి, కరీంనగర్ డెస్క్: మారుమూల పల్లెలో పుట్టి పెరిగి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. నాటకాలు వేస్తూ ప్రేరణ పొందిన వ్యక్తే.. 14 భాషలపై పట్టు సాధించారు. నందిని సిధారెడ్డి పరిచయంతో సమాజంలో అసమానతలపై రచనల ద్వారా సమాధానం చెప్పారు.. మార్క్సిజం, కమ్యూనిజం పుస్తకాల పఠనంతో తన ప్రపంచాన్ని విశాలం చేసుకున్నారు.. 25 ఏళ్ల వయసులో తన మేన మరదలిని వివాహం చేసుకున్నారు. రచయిత ఎప్పుడూ పసిమనసు కోల్పోవద్దని.. అలా ఆలోచించినప్పుడే సమాజహిత రచనలు చేయగలరని చెబుతుంటారు నలిమెల భాస్కర్. మారుమూల పల్లెటూరు నారాయణపూర్‌లో జన్మించి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకునే వరకు తాను పడిన కష్టాలు.. ఎదురైన సవాళ్లు ఆయన మాటల్లోనే..

బాల్యం.. విద్యాభ్యాసం

నా తల్లిదండ్రులు బుచ్చమ్మ–రామచంద్రం. 1955, ఏప్రిల్ ఒకటిన జన్మించాను. మాది ఇప్పటి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్. చిన్నతనంలో కరెంట్ లేక ఎక్క దీపం వెలుతురులో చదువుకున్న రోజులు గుర్తున్నాయి. ఐదేళ్ల ప్రాయంలో పాఠశాలకు వెళ్లాను. మా గురువులు చదువు రాని వారిని కఠినంగా శిక్షించే వారు. ఐదో తరగతి తర్వాత ఎల్లారెడ్డిపేటలోని హైస్కూల్‌లో చేరాను. ఆరోతరగతిలోనే పత్రికలు చదివేవాడిని. లక్ష్మీనారాయణ సార్ ప్రోత్సాహంతో ఇంగ్లిష్ పత్రికలు చదవడం అలవాటు పడింది. కృష్ణమాచారి సార్ ప్రోద్బలంతో చరిత్రకారుల పుస్తకాలు చదివాను. నాకు పదేళ్ల ప్రాయంలోనే సాహిత్య పరిచయానికి పుస్తకాలు అనే పోషకాహారం అందింది. మేథో పరిణతి కోసం బీజాక్షరాలు అప్పుడే పడ్డాయి. ఈ ఇద్దరు సార్ల ప్రోత్సాహంతో సాహిత్యం వైపు అడుగులు పడ్డాయి. మా ఇంటి ముందున్న ఎల్.నారాయణ సార్ నేను ఐదో తరగతిలో ఉన్నప్పుడు లవకుశ నాటకం ప్రాక్టీస్ చేయించారు. అయితే మాతో నాటకం ప్రదర్శన వేయించకపోవడంతో మిత్రులం కలిసి సొంతంగా మా ఇంటి ముందే నాకటం ప్రదర్శించాం. దీనికి మా గ్రామస్తుల నుంచి ఆదరణ లభించింది. ఇలా సాంస్కృతిక పరమైన బీజాలు ఇంటి నుంచే పడ్డాయి. ఎల్.నారాయణ సార్ సూచనలతో 9వ తరగతిలో ఉన్నప్పుడు రంగనాయకమ్మ బలిపీఠం పుస్తకం చదివి.. చలించిపోయాను. ఇప్పటికీ ఆ పుస్తకం నా వద్ద ఉంది. అప్పుడప్పుడు ఆ పుస్తకాన్ని చదివి.. నన్ను.. నేను పరీక్షించుకుంటాను. 9వ తరగతిలో చలించినవిధంగానే ఇప్పటికీ స్పందిస్తున్నానా?లేదా? అని పరీక్ష పెట్టుకుంటాను. ఎందుకంటే రచయితకు స్పందించాల్సిన పసిమనసు ఉండాలి. స్పందించే హృదయం లేనప్పుడు ఎన్ని రచనలు చేసినా వృథానే. అటు చదువుతోపాటు అందరి పిల్లల్లాగానే నాకు స్నేహితులు ఉండేవారు. నా బాల్యమిత్రులు ఎలుసాని మల్లయ్య, పూదరి రాజయ్య, మామిండ్ల ముత్తయ్య, నా క్లాస్‌మేట్ మేదరి రాజయ్య, నర్మాల ముత్తయ్య, డి.కిషన్, బి.కిషన్.. ఇలా అందరం కలిసి ఆటలాడుకునేవాళ్లం.



భాస్కర్ రచనలు

9వ తరగతిలోనే మొదటి నవల

తొలి తెలంగాణ ఉద్యమ సమయంలో మా ఊరిలో శ్రీరామ చందాదారుల గ్రంథాలయం ఉండేది. సీఎం కేసీఆర్ ప్రధాన సలహాదారులు రమణాచారి తండ్రి అయిన రాఘవచారి పెట్టిన శ్రీరామచందాదారుల గ్రంథాలయానికి వెళ్లి వందలాది డిటెక్టివ్ నవలలు చదివాను. వాటి ప్రభావంతో 9వ తరగతిలోనే 'కాలు కదిపావో కాల్చేస్తా' అనే డిటెక్టివ్ నవల రాశాను. పదో తరగతిలో ఓపాట రాయగా.. అనంతరాయశర్మ అభినందించారు.

కామారెడ్డిలో ఇంటర్.. పుస్తకాలతో దోస్తీ

కామారెడ్డిలోని ఇంటర్మీడియెట్‌లో ప్రవేశించాక నా లోకం విశాలమైంది. అధ్యాపకులు కసిరెడ్డి వెంకటరెడ్డి, గుండి వెంకటాచార్యులు ప్రభావంతో సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. ఫస్టియర్‌లో అనేక గేయాలు, పద్యాలు రాశాను. నిజామాబాద్ నుంచి ఎస్వీఎల్ నరసింహారావు తీసే 'అగ్నివీణ' పత్రికలో నేను రాసిన త్రివర్ణపతాక అనే పద్యం అచ్చు అయ్యింది. ఇలా తొలి పద్యం పత్రికలో అచ్చు కావడంతో నా సంతోషానికి అవధులు లేవు. 1973–74 కాలంలో రాసిన మూడు సాంఘిక నవలలను అచ్చు వేయలేదు. కానీ వాటిని ఇప్పటికీ భద్రంగా దాచి ఉంచాను 1974లో బీఎస్సీ సెకండియర్‌లో 'నా మానవుడా' అనే గేయసంపుటి పుస్తకాన్ని ముద్రించాం. ఆ పుస్తకాన్ని కామారెడ్డి కళాశాలకు అంకితం చేశాను. ఆ పుస్తకంలోని మొదటి గేయం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి అదే సంవత్సరంలో నాలుగుసార్లు ప్రసారమైంది. 1975లో డిగ్రీ పూర్తి చేసిన నేను.. 1976–77లో బీఈడీలో చేరాను. అదే సమయంలో 'భాస్కరోక్తులు' అనే శతకం రాశాను. 1977లో ఆంధ్రభూమిలోని ఆదివారం అనుబంధంలో నేను రాసిన 'మంద' అనే కథ ప్రచురితమైంది. ఆనాటి సమాజంలోని పరిస్థితులపై రాసిన కథ.

తెలంగాణ ఉద్యమంలో..

- 9వ తరగతి చదివే రోజుల్లో తొలి తెలంగాణ ఉద్యమం ఉగ్రరూపంలో ఉండేది. ఆ సమయంలో ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి 'జై తెలంగాణ' అంటే టిక్కెట్ తీసుకునేవారు కాదు.
- ఆ సమయంలో వేములవాడ సమీపంలోని తిప్పాపూర్‌లో తెలంగాణ ఉద్యమకారులు ఓ సభను పెట్టారు. దానికి పోలీసుల నిర్బంధం ఉండేది. అయినా వేలాది మంది జనం ఆ సభకు తరలివచ్చి, విజయవంతం చేశారు. ఆ సమయంలో నామిత్రులం వెళ్లాం. రాత్రి కావడంతో బస్సులు లేక రాత్రంతా వేములవాడ మూలవాగులోని ఇసుకదిబ్బలపైనే పడుకని తెల్లవారి ఊరికి వచ్చాం.
- మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ రచయితల వేదిక వ్యవస్థాపకుడు, తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి నన్ను పిలిచి తెలంగాణ మలిదశ ఉద్యమంపై మాట్లాడాలన్నారు. నీళ్లు..నిధులు.. నియామకాలపై ఉన్న వివక్ష పోగొట్టేలా మాట్లాడాను. ఆ సమయంలో తెలంగాణ భాష, యాసపై అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రసంగించాను.
- ఇరవై ఏళ్ల క్రితం 'తెలంగాణ పదకోశం' పుస్తకాన్ని వేశాను. ఇప్పటికీ చాలా సార్లు ముద్రితమైంది.
- తెలంగాణభాష–దేశ్య పదాలను, తెలంగాణభాష అవలోకనం, బాణం.. అని పరిశోధనాత్మక ఉపన్యాసాలు ఇచ్చాను.

కుప్పం వర్సిటీ ఆహ్వానించినా వెళ్లలే..

నందిని సిధారెడ్డి పరిచయంతో నా దృక్పథం మారింది. మార్క్సిజం, నాస్తికత్వం, హేతువాదం పుస్తకాలు చదివాను. 1977–79 మధ్య కామారెడ్డిలోని ప్రాచ్యవిద్యాపరిషత్ ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలో టీచర్‌గా పనిచేశాను. అదే సమయంలో కరీంనగర్ డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగం వచ్చింది. తర్వాత మూడేళ్లలో కన్నడం, మళయాళం, తమిళ భాషలు నేర్చుకున్నాను. తెలుగు, కన్నడం, మళయాళం, తమిళ భాషల్లోని సామెతలపై 1983–85 మధ్య ఎంఫిల్ పూర్తి చేశాను. తర్వాత మరో పది భాషలు నేర్చుకున్నాను. అదే సమయంలో ఏపీపీఎస్సీ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాను. మొదటి పోస్టింగ్ భద్రాచలంలో మూడున్నర ఏళ్లు, అక్కడి నుంచి మహబూబాబాద్‌లో రెండున్నరేళ్లు పనిచేశాను. 1990లో పీహెచ్‌డీ పూర్తి చేశాను. 1991లో యూనివర్సిటీలో ఉద్యోగాల కోసం పోస్టులు పడితే దరఖాస్తు చేసుకున్నా..పైరవీలు చేతకాక అక్కడికి వెళ్లలేకపోయాను. ఈ సమయంలో 14 భాషల్లోని 30 పుస్తకాలను తెలుగులోకి అనువదించాను. ఖాళీగా ఉండడం ఏమాత్రం ఇష్టపడని నేను పుస్తకాలు చదవడం, విద్యార్థులకు పాఠాలు బోధించడంలోనే కాలం గడిపేవాడిని. తర్వాత కరీంనగర్‌లోని ఎస్సారార్ కాలేజీకి లెక్చరర్‌గా ప్రమోషన్ వచ్చింది. 2006లో కుప్పం యూనివర్సిటీ నుంచి రవ్వ శ్రీహరి అక్కడికి రమ్మని ఆహ్వానించినా వెళ్లలేదు. 2011లో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. నేను రాసిన పుస్తకాలలో కవిత్వం.. కథలు.. పద్యాలు.. ఇలా తెలుగులోని అన్ని ప్రక్రియలు ఉన్నాయి.

పురస్కారాలు

- 2010లో మళయాల నవల 'స్మారకశిలలు' తెలుగులోకి అనువదించాను. దానికి 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.
- అద్దంలో గాంధారి అనే అనువాద పుస్తకాన్ని ఆరు భాషల్లో వేశాను. దానికి 1997లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అనువాద పురస్కారం వచ్చింది.
- బోయి భీమన్న గారి రూ.లక్ష పురస్కారం తెలంగాణ ప్రభుత్వం అందజేసింది.
- ఇంకా అనేకం అవార్డులు.. పురస్కారాలు అందుకున్నాను.

ఆధార్ అప్‌డేట్‌కు ఇబ్బందులు

- పొద్దంతా మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు
- సిగ్నల్ సమస్యలు, నెమ్మదిగా పనులు

జ్యోతినగర్(రామగుండం): ఆధార్ అప్‌డేట్ కోసం ఆహార భద్రత కార్డుదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ చేయాలంటే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి కావడంతో తమ కుటుంబసభ్యులతో కలిసి ఆదార్ నమోదు కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని మీ సేవా కేంద్రం వద్ద ఉదయాన్నే బారులు తీరుతున్నారు. రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో ప్రభుత్వ అధీనంలో మూడు ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయి. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆధార్ నమోదు, సవరణకు అవకాశం ఉన్నా.. పనిభారం, సాంకేతిక కారణాలు చూపుతూ సిబ్బంది సేవలు అందించేందుకు నిరాకరిస్తున్నారు. మరోవైపు ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు పొందేందుకూ ఆధార్ అప్‌డేట్, మొబైల్ నంబర్‌కు లింక్ తప్పనిసరిగా మారింది. దీనంతో ప్రజలు ఆధార్ కేంద్రం వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ వేగంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సిగ్నల్ కోసం రోడ్డుపై సిబ్బంది పాట్లు

సిగ్నల్ లేక ఇబ్బందులు..

ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని ఆదార్ కేంద్రం వద్ద అప్‌డేట్ చేసేందుకు సిగ్నల్ సమస్య ఆటంకంగా మారుతోంది. దీంతో సిబ్బంది ల్యాప్‌టాప్‌ను రోడ్డుపైకి తీసుకువచ్చి సిగ్నల్స్ కోసం అవస్థలు పడుతున్నారు. ఒకవైపు సిగ్నల్ సమస్యలు, మరోవైపు అప్‌డేట్ చేయడం ఆలస్యంగా కావడంతో ప్రజలు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు. రోజుకు వంద మందికిపైగా మీ సేవ కేంద్రానికి వస్తున్నారు. అప్‌డేట్ కోసం రోజుకు 20 నుంచి 30 మందివి మాత్రమే అప్‌డేట్ చేస్తున్నారని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. రోజంతా కూర్చుని ఉన్నా సాయంత్రం అప్‌డేట్ కాకపోవడంతో ఆవేదనతో వెనుదిరుగుతున్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి గంగుల కమలాకర్‌కు సింగరేణి బీసీ ఉద్యోగుల వినతి



మంత్రి కమలాకర్‌కు మొక్క అందిస్తున్న ఉద్యోగులు

గోదావరిఖని: సింగరేణి బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఇందుకోసం బీసీ లైజన్ ఆఫీసర్‌ను నియమించాలని బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆర్జీ–1, 2, 3 ఏరియాల అధ్యక్షులు డాక్టర్ మధుకుమార్, చంద్రమౌళి, ఐలయ్య కోరారు. శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి, వినతి పత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, సంఘానికి ఆఫీస్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి సింగరేణి సీఎండీ శ్రీధర్‌తో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- ఈ నెల 27న ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

పెద్దపల్లిరూరల్: ఓ మహిళ అత్తింటి వేధింపులకు బలైంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డుకు చెందిన నిజాంబేగ్ పెద్దపల్లి మండలంలోని హనుమంతునిపేటకు చెందిన మంజువాణిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. అయితే అప్పటికే అతనికి పెళ్లయింది. మంజువాణి పేరును సనా బేగంగా మార్పించాడు. వీరికి ఇద్దరు సంతానం. భర్తతోపాటు అత్త ఇమాంబీ, నిజాంబేగ్ మొదటి భార్య హసీనా బేగం నిత్యం సనాబేగంను వేధిస్తున్నారు. బాధితురాలు ఠాణాలో ఫిర్యాదు చేసింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో ఈ నెల 27న ఉరేసుకొని, ఆత్మహత్యకు ప్రయత్నించింది. కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి భర్త, అత్త, భర్త మొదటి భార్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు



మాట్లాడుతున్న చీఫ్ విప్ భానుప్రసాద్ రావు

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంతోపాటు మల్యాలలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను, కాల్వశ్రీరాంపూర్‌లో పద్మశాలీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఓవైపు అవార్డులు ఇస్తూ మరోవైపు నిధుల కేటాయింపులో పక్షపాత వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. అభివృద్ధిని చూసి, ప్రజలు మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. మీర్జంపేట, పోచంపల్లి, మల్యాల, ఆరెపల్లె, రాయపేట నుంచి ఓదెల మల్లికార్జున స్వామి టెంపుల్ వరకు, మల్యాల–కొత్తపల్లి రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీపీ సంపత్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో రామ్మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

'పరిశుభ్ర వాతావరణమే లక్ష్యం'



బహుమతి ఇస్తున్న కమిషనర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: పరిశుభ్రతమైన వాతావరణం సృష్టించడం ధ్యేయంగా స్వచ్ఛతా హీ సేవ చేపట్టామని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ నాగేశ్వర్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెప్మా సహకారంతో శుక్రవారం బల్దియా కార్యాలయం ఆవరణలో రంగోలి, ఫుడ్ ఫెస్టివల్, వేస్ట్ టు వండర్ పోటీలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. అక్టోబర్ 16న ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ లక్ష్యం 'ఆహారం వృథా చేయకుండా ఎంతకావాలో అంతేతీసుకోండి' అని చెప్పడమేనన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఒకగంటపాటు శ్రమదానం ద్వారా పరిసరాలు శుభ్రం చేయాలని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, మెప్మా డీఎంసీ రజని, జూనియర్ అసిస్టెంట్ శంకర్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.